క్లుప్తంగా

ఏకసభ్య కమిషన్ వేయడం అభినందనీయం



గుడివాడ టౌన్: ఎస్సీ వర్గీకరణ అమలుకు సంబంధించి ప్రభుత్వం ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల సుధాకర్ అన్నారు. శనివారం స్థానిక గుడ్‌మెన్ పేటలోని బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు వెంపటి సైమన్, టి.ప్రశాంత్, గంధం సైమన్‌బాబు, సాల్మన్, శేఖర్ పాల్గొన్నారు.

నేరాలకు దూరంగా ఉండాలి

గుడివాడరూరల్: చిరు ప్రాయం నుంచి విద్యార్థులు నేరాలకు దూరంగా ఉండాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు పేర్కొన్నారు. మండలంలోని బొమ్ములూరు గ్రామంలో ఉన్న ఎంపీయూపీఎస్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రత, చిన్నారుల భద్రత, సైబర్ నేరాలపై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి, మత్తు పానీయాలు, డ్రగ్స్ జీవితాలను నాశనం చేస్తాయన్నారు. విద్యార్థి దశ నుంచే నేరాలు, వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. చదువుపై శ్రద్ధ చూపి లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు.

విద్యార్థులకు అవగాహన

పామర్రు: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పామర్రు సీఐ వి.సుభాకర్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డీపీఎస్ యాక్ట్, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, శక్తి టీములు తదితరాల గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త పేరుకుపోకుండా చూడాలి



గుడివాడ టౌన్: పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో రోడ్లపై చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, సీఓలు, మెప్మా సీఎంఎం లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణంలో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చేపట్టిన కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఎస్.అప్పారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

గుడివాడరూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు హెచ్చరించారు. మండలంలోని బొమ్ములూరు సమీపంలో ఎంఎన్‌కె రహదారిపై శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ముందుగా 20 వాహనాలకు సంబంధించి నిబంధనలు అతిక్రమించినట్లుగా గుర్తించి వారికి రూ.9,020లు అపరాధ రుసుం విధించారు.

బాలల ఆరోగ్యమే భవిష్యత్‌కు భద్రత



పామర్రు: బాలల ఆరోగ్యమే భవిష్యత్‌కు భద్రత కల్పిస్తుందని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. పామర్రు పంచాయతీ పరిధిలోని చాట్లవానిపురం ఎంపీపీ పాఠశాల్లో రాష్ట్రీయ బాలల స్వాస్థ్య ఆరోగ్య కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ 6 నుంచి 15 సంవత్సరాల వయసు వరకు ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. వీరికి ఆరోగ్య కార్డులను అందజేస్తామన్నారు. ప్రతి గురు, శనివారాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, కనుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టరు సురేష్ పాల్గొన్నారు.

వెంట్రప్రగడలో..

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ ఎంపీపీ ప్రాథమిక పాఠశాల్లో శనివారం రాష్ట్రీయ బాలల స్వాస్థ్య కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యులు సందీప్ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్య సమస్యలను గుర్తించి, నివారణకు మందులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పద్మజ, టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్ చౌదరి పాల్గొన్నారు.

బుడమేరుపై నూతన వంతెన నిర్మించరా..!

పుట్టగుంట వద్ద వంతెన కోసం ఎదురు చూపులు



బుడమేరుపై రైలింగ్ లేకుండా ప్రమాదకరంగా మారిన వంతెన (ఫైల్)

పుట్టగుంట గ్రామం వద్ద బుడమేరుపై వంతెన శిథిలావస్థకు చేరింది. దీని స్థానంలో నూతన వంతెన నిర్మాణం కోసం ఎదురు చూస్తున్న ప్రజల ఆశలు అడియాశలే అవుతున్నాయి. ప్రభుత్వాలు, పాలకులు మారినా వంతెన నిర్మాణం ఊసెత్తడం లేదు. ఫలితంగా పరిసర ప్రాంత గ్రామాల ప్రజలతో పాటు ఇతర జిల్లాల ప్రజలు ప్రయాణాలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గుడివాడరూరల్: బుడమేరుపై వంతెన శిథిలమై రేపో మాపో కూలేందుకు సిద్ధమైంది. వంతెన పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలంటూ వేడుకుంటున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని ప్రజలు వాపోతున్నారు. పుట్టగుంట గ్రామం వద్ద బుడమేరుపై తొమ్మిది దశాబ్దాల క్రితం ప్రజలు ఏరు దాటి రావాలంటే పడవలే గతి. పశ్చిమగోదావరి, ఇతర జిల్లాల నుంచి కృష్ణా జిల్లా గుడివాడ, మచిలీపట్నం, పామర్రు ప్రాంతాలకు రావాలంటే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. బుడమేరు దాటాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. బ్రిటీష్ కాలంలో చల్లపల్లి జమీందార్‌లు అప్పటి ప్రభుత్వ సహకారం, సొంత నిధులు వెచ్చించి బుడమేరుపై వంతెన నిర్మాణం చేపట్టారు. వంతెన నిర్మాణంతో జిల్లాకు ఇతర జిల్లాల నుంచి రాకపోకలకు ఏర్పడి సమస్యకు పరిష్కారం లభించింది. దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. వంతెన రైలింగ్ పూర్తిగా ధ్వంసమై రూపురేఖలు కోల్పోయింది. వంతెనపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారింది.

పట్టించుకోని పాలకులు, అధికారులు

స్వాతంత్ర్యం రాక పూర్వం నిర్మించిన వంతెనను పాలకులు పట్టించుకోకపోవడంతో ప్రజలకు వంతెన శాపంలా మారింది. ఎన్నికలు వచ్చిన సమయంలో వంతెన నిర్మాణం చేపడతామని ఉపన్యాసాలు చెప్పి తీరా గెలిచిన తర్వాత ప్రజాప్రతినిధులు వంతెన ఊసే ఎత్తకుండా ముఖం చాటేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. వంతెన మరమ్మతులను సైతం అధికారులు గాలికి వదిలేశారు. బుడమేరు ఆధునికీకరణ చేపట్టిన సమయంలో వంతెన నిర్మాణానికి నిధులు వచ్చాయని హడావుడి చేసి, వంతెన సమీపంలో తాత్కాలిక వంతెనను ఏర్పాటు చేశారు. తీరా నిధులు ఇవ్వలేదని చెప్పి తాత్కాలిక వంతెనను తొలగించడంతో పాత వంతెనే ప్రజలకు దిక్కుగా మారింది. దశాబ్దాల కాలంగా ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్న వంతెన నిర్మాణాన్ని ప్రస్తుత పాలకులైనా పట్టించుకుని వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వరదలు వస్తే రాకపోకలు బంద్

బుడమేరుకు చిన్నపాటి వరదలకు సైతం పొంగిపొర్లుతుండటటం, వరద నీరు ఎగువ పుట్టగుంట వంతెన మార్గం నుంచే కొల్లేరులోకి వెళ్లాల్సి ఉంది. వంతెన కుంగిపోవడంతో చిన్నపాటి వరదలకు వంతెనపై నుంచి నీరు ప్రవహిస్తుంది. దీంతో వాహన రాకపోకలు అంతరాయం కలుగుతుంది. ఇటీవల సంభవించిన భారీ వరదలకు పక్షం రోజుల పాటు వంతెన నీటిలో మునిగి ఉండటంతో వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. కృష్ణా జిల్లాకు ఇతర ప్రాంతాలకు సంబంధాలు తెగిపోయాయి.

ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం



బుడమేరుపై వంతెన శిథిలం కావడం మాకు శాపంలా మారింది. వరదలు వచ్చిన సమయంలో వంతెన మునిగి ప్రయాణాలకు నరకప్రాయంగా మారింది. అధికారులు, పాలకులకు మొర పెట్టుకున్నా మా బాధ వినేవారే లేరు. ఇప్పటికైనా నూతన వంతెన నిర్మాణం చేపట్టాలి.

– వెంకటరమణ, చినలింగాల గ్రామస్తుడు

నిధులు మంజూరు చేసి పుణ్యం కట్టుకోండి



బుడమేరుపై నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని ఎందరో నాయకులకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న వారే లేరు. నిధులు మంజూరు చేస్తామని చెప్పి వెళ్తున్నారేగాని ఆచరణలో పెట్టడం లేదు. వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పాలకులు పుణ్యం కట్టుకోవాలి.

– కలపాల నాగులు, మాజీ సర్పంచ్, పెదలింగాల

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



గుడివాడలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గుడివాడ టౌన్: గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమశ్రేణి గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి బి.వెంకటరమణ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

పామర్రు: గ్రంథాలయాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పామర్రు ఎంఈఓ-2 పద్మవాణి పేర్కొన్నారు. స్థానిక ద్వితీయ శ్రేణి గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ ఉద్యమ నాయకులపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమాల్లో ప్రముఖులు పీఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకట రమణయ్య పాల్గొని గ్రంథాలయాలకు స్వతంత్ర ప్రతిపత్తిని సాధించారన్నారు. జమీగొల్వేపల్లిలో గ్రంథాలయపితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి వి.నాగసురేష్ పాల్గొన్నారు.

గ్రంథ పఠనంతో విజ్ఞానం

పమిడిముక్కల: గ్రంథ పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కేసీపీ జీఎం వి.వి.పున్నారావు పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అగినపర్రు శాఖా గ్రంథాలయంలో అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పున్నారావు పూలమాలేసి నివాళులర్పించారు. గ్రంథ పాలకులు బొబ్బా లావణ్య, కేసీపీ డీజీఎం జి.వెంకటేశ్వరరావు, రామచంద్రరావు పాల్గొన్నారు. కపిలేశ్వరపురం గ్రంథాలయంలో అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్ : గ్రంథాలయాల పితామహుడు అయ్యంకి వెంకటరమణ ఆశయాలు నెరవేర్చేందుకు విద్యార్థులు కృషి చేయాలని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం ముదినేపల్లి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు కనకమోహన్, వెంకట సుబ్బారావు, లైబ్రేరియన్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో..

పామర్రు(తోట్లవల్లూరు): తోట్లవల్లూరు శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల సందర్భంగా తోట్లవల్లూరు జెడ్పీ హైస్కూల్ హిందీ ఉపాధ్యాయుడు జీకె పీటర్ సన్ శనివారం అయ్యంకి వెంకటరమణయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాల ప్రాముఖ్యతను అధునాత గ్రంథాలయ ఆవిర్భావం తదితర అంశాలను వివరించారు. గ్రంథాలయ అధికారి డి.బాబూరావు పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం గ్రంథాలయ ఉద్యమంలో పాలుపంచుకున్న డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, ఐఎన్‌జీ, వెంకట రమణయ్యను స్మరించుకున్నారు. కైకలూరు గ్రంథాలయంలో ప్రముఖ సాహితీవేత్త చింతపల్లి వెంకటనారాయణ ప్రముఖుల గురించి వివరించారు. మహిళా నాయకురాలు పి.కల్యాణి పాటలు ఆకట్టుకున్నాయి. గ్రంథాలయాధికారి కె.శ్రీనివాస్, సిబ్బంది లక్ష్మి, రాంబాబు, వాణి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. కలిదిండిలో గ్రంథాలయాధికారి జె.రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్యకు అంగలూరు గ్రంథాలయంలో నివాళులర్పించారు. మండలంలోని అంగలూరుతో పాటు గుడ్లవల్లేరు గ్రంథాలయాల్లో శనివారం జాతీయ గ్రంథాలయ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. జిల్లా డైట్ ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణ, గ్రంథాలయాధికారులు పి.వి.వి.పద్మజ, టి.వాణి పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక దీపోత్సవం



పామర్రులో శివలింగాకారంలో దీపాలను వెలిగించిన భక్తులు

పామర్రు: స్థానిక గుడివాడ రోడ్డులోని బాపూజీ పేట విఘ్నేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసం పురస్కరించుకుని దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు దీపాలను శివలింగాకారం, పద్మం, స్వస్తిక్, శంకుచక్రాలు నామం తదితర ఆకారాల్లో వెలిగించారు. ఆలయ కమిటీ చైర్మన్ దునుకు దుర్గా ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ బాడిశ సాంబశివరావు, సెక్రటరీ విలాసారపు శివకృష్ణ , సభ్యులు బాడిశ శివయ్య, సాంబశివరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పరమేశ్వరునికి పసుపుతో అభిషేకం

పామర్రు: స్థానిక అంకమ్మతల్లి ఆలయంలోని రేణుకా పరమేశ్వరుడికి శనివారం పసుపుతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు వరదా అప్పారావు , గౌరవాధ్యక్షుడు కోటి పాండురంగారావు, సభ్యులు ఉమా మహేశ్వరరావు, ఎం.పేరయ్య, కె.చెన్నారాయుడు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలో కార్తికమాస పూజలు శనివారం నిర్వహించారు. మండలంలోని కానుకొల్లు, లింగాల, పెరికెగూడెం, అయ్యవారిరుద్రవరం, భైరవపట్నం తదితర ఆలయాల్లో అర్చకులు పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా లక్ష బిల్వార్చన

చినముత్తేవి(మొవ్వ): మొవ్వ మండలం చినముత్తేవిలోని శ్రీ అన్నపూర్ణాదేవి సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో కార్తిక మాసం సందర్భంగా శనివారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆ గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు జొన్నలగడ్డ హనుమకుమార్, విశ్రాంత వీఆర్ఓ రాయపాటి అయ్యప్ప రాజుల పర్యవేక్షణలో మచిలీపట్నం నుంచి విచ్చేసిన వేద పండితులు ఈ కార్యక్రమానికి కొనసాగించారు. అనంతరం ఉపవాసదీక్షతో లక్ష పత్రి బిల్వార్చన, నక్షత్ర దర్శనం అనంతరం దీక్ష విరమించారు.

పోలీసు పహారాలో మత్స్యకార సొసైటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ

గుడ్లవల్లేరు: పోలీసు బందోబస్తు పహారా నిర్వహిస్తుండగా విన్నకోట మత్స్యకార సొసైటీ ఎన్నికను శనివారం స్థానిక పీఏసీఎస్‌లో నిర్వహించారు. సొసైటీ ప్రెసిడెంట్‌గా ముత్యాల గోవిందరాజు, సెక్రటరీగా వారా పోతురాజు, వైస్ ప్రెసిడెంట్‌గా తోట పానకాలరావు, డైరెక్టర్లుగా సాలి కన్నయ్య, వారా నమ్మయ్య, గంజి రాఘవులు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రతిభ తెలిపారు. సొసైటీ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఉండేందుకే పోలీసుల రక్షణలో ఈ ఎన్నికను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు. ఎస్ఐ ఎస్.వి.వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పరిమళించిన మానవత్వం

తోటి విద్యార్థినికి రూ.3.51 లక్షల సాయం



కైలాషి చికిత్స నిమిత్తం చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు: సహచర విద్యార్థిని చికిత్స నిమిత్తం రూ.3.51 లక్షలు అందించి తోటి విద్యార్థులు మానవత్వాన్ని చాటుకున్నారు. స్థానిక నేషనల్ స్కూల్లో నాలుగో తరగతి చదువుతున్న భట్రాజు భూపిక కైలాషికి మెదడులో రక్తం గడ్డకట్టడంతో కొద్దిరోజులుగా హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విద్యార్థిని తండ్రి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో పాఠశాల కరస్పాండెంట్ గురజాడ చంద్రమోహన్ పిలుపు మేరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం కలిసి నగదు సమకూర్చారు. ఆ మొత్తాన్ని స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చేతులమీదుగా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కరేటి శ్రీహరికి పాఠశాల వద్ద శనివారం అందించారు.

అంగన్‌వాడీ చిన్నారులకు వైద్యం



కూరాడలో విద్యార్థులకు డాక్టర్ శ్రావ్య వైద్య పరీక్షలు

గుడ్లవల్లేరు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాష్ట్రీయ బాల్ స్వస్థ్య కార్యక్రమం కింద కూరాడలో చిల్డ్రన్స్ మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ శిబిరంలో అంగన్‌వాడీ విద్యార్థులకు కౌతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బి.శ్రావ్య వైద్య పరీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ ప్రకాష్, పీహెచ్ఎన్ సైదాబీ, హెచ్ఎస్ ఉమామహేశ్వరరావు, కల్యాణపు నవాబు, బాసా రాంబాబు, శ్రీహరి పాల్గొన్నారు.

వేమవరంలో..

గుడ్లవల్లేరు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాష్ట్రీయ బాల్ స్వస్థ్య కార్యక్రమం కింద వేమవరంలో చిల్డ్రన్స్ మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉలవలపూడి గ్రామ సర్పంచ్ పామర్తి కన్య భాస్కరరావు శనివారం ప్రారంభించారు. విద్యార్థులకు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బి.శ్రావ్య వైద్య పరీక్షలు చేపట్టారు. ఎంపీహెచ్‌ఓ ప్రకాష్, పీహెచ్ఎన్ సైదాబీ, హెచ్ఎస్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు పోటెత్తారు. భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో ఈ అన్న సమారాధన జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా దత్తాత్రేయులు

గుడివాడ టౌన్: గుడివాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా దత్తాత్రేయులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు వద్దాది రాజేష్, పట్టణ అధ్యక్షుడు సదర్ల నాగేంద్ర పాల్గొన్నారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

గుడివాడరూరల్: గుడివాడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలోని గుడివాడ, గుడ్లవల్లేరు, పామర్రు ప్రాంతాల పరిధిలో ఎక్కడైన మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆ శాఖ సీఐ పి.వెంకటరమణ హెచ్చరించారు. స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లోని తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గుడివాడ ప్రొహిబిషన్ పరిధిలోని గ్రామాల్లో ఎక్కడైనా మద్యం విక్రయాలు జరిగితే ఆయా గ్రామాల ప్రజలు తమకు గాని, పోలీసులకు గాని సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. లైసెన్స్ మద్యం షాపుల నిర్వాహకులు ఎవరైనా బెల్టుషాపులకు మద్యం సరఫరా చేశారని తెలిస్తే రూ.5 లక్షల జరిమానాతో పాటు షాపు లైసెన్స్ కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు.

సోషల్ మీడియా ప్రభావంపై చిత్రలేఖనం



బహుమతులు పొందిన విద్యార్థులలో నిర్వాహకులు

కైకలూరు: నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా జాన్‌పేట ఎస్ఎం ఎల్‌పీఆర్ బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాలలపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై చిత్రలేఖనం పోటీలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో-ఆర్డినేటర్ లీలావతి మాట్లాడుతూ సోషల్ మీడియా పిల్లల బాల్యం, చదువుపై ఇది ప్రతికూల ప్రభావం చూపడమే కాకుండా వారి మానసికి పరిస్థితిని కూడా దెబ్బతీస్తోందని హెచ్చరించారు. చిత్రలేఖనంలో సుల్తానా, ఆనంది, నవ్యశ్రీ బహుమతులు పొందారు. ఉపాధ్యాయురాలు రత్నశ్రీ, ఫాతిమా బేగం, అన్నపూర్ణ, నిర్మల, మేరీరాణి, చరిత, ప్రసాద్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలు సిద్ధం

ముదినేపల్లి రూరల్: త్వరలో నిర్వహించే సాగునీటి సంఘాల ఎన్నికలకు ఓటర్ల జాబితాను సిద్ధం చేసినట్టు తహసీల్దార్ జీఎస్ సుభాని తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం సుభాని మాట్లాడుతూ మండలంలోని ప్రధానమైన పోలరాజ్, క్యాంప్‌బెల్, బీఎండీ కాల్వల పరిధిలో 12 సాగునీటి సంఘాలు ఉన్నట్టు చెప్పారు. ఈ సంఘాల పరిధిలో 17,020 మందికి ఓటు హక్కు ఉందన్నారు. నీటి సంఘాలను ప్రాదేశిక నియోజకవర్గాలుగా విభజించినట్టు తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు అనుగుణంగా ఓటు హక్కు ఉన్న రైతులు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

మండవల్లి: మిషన్‌శక్తి కార్యక్రమంలో భాగంగా బాలల హక్కులపై చింతపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకటనాగలక్ష్మి మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.రజని, వజ్రమ్మ, జ్యోతి, మహిళా పోలీస్ పి.పార్వతి, ఏఎన్ఎం విజయ, ఎన్‌సీహెచ్‌బీ సంగీత పాల్గొన్నారు.

ఇన్‌చార్జీలతో అవస్థలు

మండవల్లి: ప్రభుత్వ కార్యాలయాల్లో ఇన్‌చార్జి వ్యవస్థ ద్వారా మెరుగైన సేవలు అందక, పనులు సకాలంలో జరుగక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల శాఖ అధ్యక్షుడు టి.అప్పారావు పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయం వద్ద శనివారం వారు మాట్లాడుతూ కీలకమైన రెవెన్యూ, మండల పరిషత్, పీహెచ్‌సీ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొంతకాలం నుంచి అధికారులు లేకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఆయా శాఖల్లో పూర్తిస్థాయి అధికారులను నియమించాలని కోరారు.

అంగన్‌వాడీ సెంటర్‌లో ఎంపీ, ఎమ్మెల్యే

మండవల్లి: స్థానిక అంగన్‌వాడీ సెంటర్-1కు ఎంపీ పుట్టా మహేష్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ శనివారం విచ్చేశారు. ఎమ్మెల్యే కామినేని మొక్క నాటారు. సెంటర్లో పచ్చదనం-పరిశుభ్రత బాగుందని కార్యకర్త సరస్వతిని అభినందించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, బీకేఎం నాని, పూలా రాజీ, గంగునేని వరప్రసాద్ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి వెండి మకరతోరణం సమర్పణ



కైకలూరు: కైకలూరు-ఏలూరు రహదారిలో అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్పకు భక్తుడు వెండి మకరతోరణాన్ని శనివారం సమర్పించుకున్నారు. కైకలూరు వెలంపేటలో తాపీమేస్త్రీ కండబోతు శ్రీను రూ.1,73,000 విలువ చేసే తోరణాన్ని అందజేశారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గురుస్వామి తమ్మిరెడ్డి వెంకట అప్పారావు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలపై శిక్షణ

కైకలూరు: మండలంలో త్వరలో నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడే అవకాశాలు ఉండటంతో ఎన్నికల నిర్వాహణ సిబ్బందికి ఒక రోజు శిక్షణ స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఇన్‌చార్జి తహసీల్దారు ఎండీ ఇబ్రహీం ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటుచేశారు. రిసోర్సుపర్సన్ ఉపాధ్యాయుడు పి.భాస్కరరావు సిబ్బందికి వివరిస్తూ కైకలూరు మండలంలో కైకలూరు, పల్లెవాడ, వేమవరప్పాడు, దొడ్డిపట్ల, తామరకొల్లు, గోపవరం నీటి సంఘాల పరిధిలో 72 టీసీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని చెప్పారు.

అభివృద్ధి ప్రణాళికపై అవగాహన

కైకలూరు: రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్ఏ)లో భాగంగా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, మండల అభివృద్ధి కార్యచరణ ప్రణాళికపై స్థానిక మండల పరిషత్ సమావేశం హాల్లో అవగాహన కార్యక్రమం శనివారం ఏర్పాటుచేశారు. ఈఓపీఆర్డీ కొండలరావు కార్యచరణ ప్రణాళిక 2025-26లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ అందించారు. ఎంఈఓ శ్రీనివాసరావు, రిసోర్సు పర్సన్లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రేడ్-1, గ్రేడ్-5 సచివాలయ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ గుర్తింపునకు కృషి

ముదినేపల్లి రూరల్ : క్రియాశీలక కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి, ప్రభుత్వ గుర్తింపునకు కృషి చేయాలని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, కైకలూరు, గుడివాడ ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, వెనిగండ్ల రాము అన్నారు. మండలంలోని పెదపాలపర్రులో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రిచౌదరి నివాసంలో టీడీపీ సభ్యత్వ నమోదు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమావేశం శనివారం నిర్వహించారు.